‘పది’పై ప్రత్యేక శ్రద్ధ

- విద్యార్థులకు ప్రత్యేక తరగతులు
- పరీక్షలకు సన్నద్ధం చేస్తున్న ఉపాధ్యాయులు
- వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యం


బోథ్ మోడల్ స్కూల్‌లో చదువుకుంటున్న విద్యార్థులు

బోథ్ మండలంలోని పాఠశాలలు..

జెడ్పీ పాఠశాలలు	09
ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు	01
ఆశ్రమ పాఠశాలలు	03
మోడల్ స్కూల్	01
కస్తూరిబా పాఠశాలలు	01
సోషల్ వెల్ఫేర్ పాఠశాల	01
ప్రైవేట్ పాఠశాలలు	03
మొత్తం విద్యార్థులు	648

బోథ్: పదో తరగతి.. విద్యార్థుల భవిష్యత్‌కు తొలిమెట్టు. వారి బంగారు భవిష్యత్‌కు దశ, దిశను నిర్దేశం జరిగేది ఇక్కడే. పదో తరగతిలో ప్రతిభ కనబర్చితే విద్యార్థుల భవిష్యత్ బంగారు బాట పడుతుంది. కానీ విద్యార్థుల జీవితంలో ఎంతో విలువైన పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించడం అంటే అంతా సులువు కాదు. దీనిని అధిగవించేందుకు ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు వినూత్న తరహాలో విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ఉన్నతస్థాయి ఫలితాలు సాధించేలా ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారు.

ప్రణాళికను పాటిస్తే ఉత్తమ ఫలితాలు..
మండలంలోని ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేసుకొని ముందుకు సాగుతున్నారు. బోథ్ మండలంలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులు మొత్తం 648 ఉన్నారు. ఆరేళ్లుగా పదో తరగతి పరీక్ష విధానంలో మార్పులు చోటు చేసుకున్నాయి. పదో తరగతి విద్యార్థులకు 20 మార్కులు ఇంటర్నల్ కాగా, 80 మార్కులకు రాత పరీక్షలు ఉంటాయి. సీసీఈ ప్రశ్నావళి విధానంతో పదో తరగతి పరీక్షలు నిర్వహిస్తున్నందున వీటిని దృష్టిలో పెట్టుకుని ఉత్తమ ఫలితాలే లక్ష్యంగా ఉపాధ్యాయులు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు.

ముందుగానే అవగాహన..
పదో తరగతి పరీక్షల ఎలా రాయాలి? ఎలా సిద్ధం కావాలి? అనేదాని కోసం విద్యార్థులకు పాఠశాలల్లో ముందుగానే అవగాహన కల్పిస్తున్నారు. ప్రైవేటు పాఠశాలల స్థాయిలో ఉదయం, సాయంత్రం అదనంగా ఒక గంట పాటు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ఉదయం 8.30 గంటల నుంచి 9.30 గంటల వరకు, సాయంత్రం 4.40 గంటల నుంచి 5.30 గంటల వరకు ప్రత్యేకంగా స్టడీ హవర్స్‌తో తరగతులు నిర్వహిస్తున్నారు. ఎలా చదవాలి, ఎక్కువ మార్కులు ఎలా సాధించాలని అని అవగాహన కల్పిస్తున్నారు.

10 జీపీఏ సాధించడమే లక్ష్యం


పదో తరగతిలో 10 జీపీఏ సాధించడమే లక్ష్యంగా చదువుతున్నా. చదివేందుకు ఉదయం, రాత్రి సుమారు ఐదు గంటల సమయాన్ని కేటాయిస్తున్నా. 10 జీపీఏ సాధించి ట్రిపుల్ ఐటీలో సీటు సాధించడమే నా ధ్యేయం.
– డి.రసగ్న, పదో తరగతి, మోడల్‌స్కూల్, బోథ్

సందేహాలు నివృత్తి


సమయాన్ని సద్వినియోగం చేసుకుంటున్నా. పాఠాల్లోని సందేహాలను స్టడీ హవర్స్‌లో నివృత్తి చేసుకుంటున్నా. పది జీపీఏ పాయింట్లు సాధిస్తా. ఉన్నత స్థాయిలో స్థిరపడాలన్నదే నా కోరిక.
సి. నందిని, పదో తరగతి, మోడల్‌స్కూల్, బోథ్

ప్రతీ విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ

పరీక్షల్లో విద్యార్థులు 10 జీపీఏ సాధించడమే లక్ష్యంగా ప్రణాళికతో ముందుకెళ్తున్నాం. రోజువారీగా సబ్జెక్ట్ స్టడీ హవర్స్ నిర్వహిస్తూ విద్యార్థుల సందేహాలను నివృత్తి చేస్తున్నాం. వంద శాతం ఉత్తీర్ణత సాధించేందుకు ఉపాధ్యాయుల సహకారంతో ముందుకెళ్తున్నాం.
– ఉమేశ్‌రావు, ప్రిన్సిపాల్, మోడల్ స్కూల్, బోథ్

క్లుప్తంగా

ధ్రువీకరణ పత్రాలు అందజేయాలి

ఆదిలాబాద్‌రూరల్: గృహజ్యోతి పథకంలో భాగంగా సమాచార ధ్రువీకరణ చేపడుతున్నామని, ఇంటివద్దకు వచ్చే విద్యుత్‌శాఖ సిబ్బందికి వాటిని అందజేసి సహకరించాలని మండల విద్యుత్ శాఖ అధికారి తిరుపతిరెడ్డి ఒక ప్రకటనలో కోరారు. ప్రజాపాలన దరఖాస్తు రశీదుతో పాటు ఆహార భద్రత కార్డు (రేషన్ కార్డు), ఆధార్ కార్డు నంబర్లను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. అందుబాటులో లేకుంటే విద్యుత్ సహాయ ఇంజినీర్ కార్యాలయంలో, విద్యుత్ సహాయ గణక అధికారి కార్యాలయంలో అందజేయాలన్నారు.

దరఖాస్తుల పరిశీలన పకడ్బందీగా చేపట్టాలి


మాట్లాడుతున్న డీఎస్‌వో కిరణ్‌కుమార్

ఇచ్చోడ: ప్రజాపాలన దరఖాస్తులను పకడ్బందీగా పరిశీలించాలని డీఎస్‌వో కిరణ్‌కుమార్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో డీఎల్‌పీవో ధర్మారాణి, ఎంపీడీవో రాంప్రసాద్‌తో కలిసి సర్వేను పరిశీలించి మాట్లాడారు. మహాలక్ష్మి పథకం కింద రూ. 500లకే గ్యాస్ సిలిండర్ కోసం దరఖాస్తులు చేసుకున్న వాటిలో తప్పులు ఉండడంతో సర్వే బృందాలతో పరిశీలిస్తున్నట్లు తెలిపారు. దరఖాస్తులలో తప్పిదాలను సవరించేందుకు సర్వే బృందాలు ఈనెల 10 వరకు గ్రామాల్లో పర్యటించనున్నట్లు పేర్కొన్నారు.

వివరాలు యాప్‌లో నమోదు చేయాలి

బోథ్: స్వయం సహాయ సంఘాల వివరాలను యాప్‌లో నమోదు చేయాలని డీఆర్‌డీఏ ఏపీడీ చరణ్‌దాస్ అన్నారు. గురువారం బోథ్ మండల సమాఖ్య కార్యాలయంలో స్వయం సహాయక సంఘాలు, అధికారులతో సమావేశం నిర్వహించారు. యాప్‌లో వివరాలు నమోదు చేయకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఫైనాన్స్ డీపీఎం శేషరావ్, సీసీలు, మహిళా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

హీరాసుక జయంతి కరపత్రాలు ఆవిష్కరణ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న జోగు రామన్న

ఆదిలాబాద్‌టౌన్: గోండి ధర్మగురు హీరాసుక జయంతి ఉత్సవాల పోస్టర్‌ను మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న గురువారం జిల్లా కేంద్రంలో ఉత్సవ కమిటీ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఇంద్రవెల్లి మార్కెట్ యార్డులో ఈనెల 26 సోమవారం ఉదయం 11 గంటలకు హీరాసుక జయంతి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ నాయకులు తెలిపారు.

జిల్లా ఎక్సైజ్ అధికారికి సన్మానం

ఆదిలాబాద్‌టౌన్: ఎక్సైజ్‌శాఖ హెడ్ కానిస్టేబల్, కానిస్టేబుల్స్ అసోసియేషన్ ప్రతినిధులు గురువారం జిల్లా ఎక్సైజ్ అధికారి హిమశ్రీని మర్యాద పూర్వకంగా కలిశారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాజిరెడ్డి ఆదిలాబాద్ జిల్లాకి హాజరైన సందర్భంగా ఆమెను శాలువాతో సత్కరించి, పుష్పాగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పోచ్చన్న, కార్యదర్శి అరవింద్ యాదవ్, సాయిబాబా, అష్టకల రవీందర్, విఠల్, భూమన్న, వెంకటగిరి, మహేందర్, అరుణ పాల్గొన్నారు.

ఆత్రం భాస్కర్‌ను కలిసిన నాయకులు

నేరడిగొండ: కాంగ్రెస్ నుంచి పార్లమెంట్ సభ్యులుగా పోటీ చేసేందుకు దరఖాస్తు చేసుకున్న ఆత్రం భాస్కర్‌ను వివిధ సంఘాల నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. గురువారం మండల కేంద్రంలోని ఆదివాసీ భవన్‌లో కలిశారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ ఆత్రం లక్ష్మణ్, మాజీ సర్పంచ్ కోటేష్, ఎంపీటీసీ ఆత్రం భీంరావు, రాజు, గంగాధర్, జైతు, ప్రకాష్, అనిల్ పాల్గొన్నారు.

పాఠశాలను సందర్శించిన డీఈవో

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని జందాపూర్ ప్రభుత్వ మండల ప్రాథమిక పాఠశాలను జిల్లా విద్యాశాఖాధికారి ప్రణీత గురువారం సందర్శించారు. విద్యార్థులతో చదివించి వారి సామర్థ్యాలను పరిశీలించారు. ప్రాథమిక దశ నుంచే నాణ్యమైన విద్యనందిస్తే ఉన్నతంగా రాణించగలుగుతారని ఉపాధ్యాయులకు సూచించారు. అంతకు ముందు ఉపాధ్యాయులు, విద్యార్థుల అటెండెన్స్ రిజిస్టర్లతో మధ్యాహ్న భోజన నిర్వాహణను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

కొనసాగుతున్న స్పెషల్ డ్రైవ్

బోథ్: ప్రభుత్వం నిర్ణయించిన ప్రత్యేక స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ బోథ్ మండలంలో కొనసాగుతోంది. ఈనెల 7 నుంచి ప్రారంభమైన కార్యక్రమాలు 14 వరకు కొనసాగనున్నాయి. గురువారం గ్రామాల్లో పిచ్చిమొక్కలు తీయడం, డ్రెయినేజీల్లో పూడిక తీత వంటి పనులు చేపట్టారు. పంచాయతీ కార్యదర్శులు పనులను పర్యవేక్షించారు.

ఇచ్చోడ: మండలంలోని కేశవపట్నంలో గురువారం పంచాయతీ అధికారి జాదవ్ రామారావు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. రోడ్లపై చెత్త వేసిన కిరాణ దుకాణల యజమానులకు రూ. 500 జరిమానా విధించారు. రోడ్లపై చెత్త వేస్తే జరిమానా విధిస్తామని హెచ్చరించారు. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు.


జరిమానా విధిస్తున్న రామారావు

అభినవ్ సర్దార్ ఫౌండేషన్ సేవలు అభినందనీయం

సిరికొండ: మండలంలోని సుంకిడి గ్రామ పంచాయతి పరిధిలోని మారుమూల గ్రామమైన కోసుపటేల్ గూడలో అభినవ్ సర్దార్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్మించిన పాఠశాల భవన నిర్మాణాన్ని గురువారం జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి రాథోడ్ రమేశ్, జిల్లా వైద్యాధికారి రాథోడ్ నరేందర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. పాఠశాల భవనం లేక పూరి గుడిసెలో చదువులు కొనసాగిస్తున్న విద్యార్థుల భవిష్యత్‌ను ఆలోచించి సుమార్ రూ. 3 లక్షలు ఖర్చు చేసి నూతన పాఠశాల భవనాన్ని నిర్మించారు. ఫౌండేషన్ వ్యవస్థాపకుడు అభినవ్ సర్దార్ కేశావత్ మాట్లాడుతూ.. రేకుల గుడిసెలో చదువుల కొనసాగిస్తుండటం చూసి చాలించిపోయి భవన నిర్మాణం చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో గ్రామపటేల్ కోసేరావు, కరాడే బ్రహ్మనందం, పెంటన్న, బషీర్, యాదవ్‌రావు, జాదవ్ కైలాస్, గ్రామస్తులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న అభినవ్ సర్దార్ కేశావత్

‘యువత క్రీడల్లో రాణించాలి’

బేల: గ్రామీణ యువత క్రీడల్లో రాణించాలని యూత్ కాంగ్రెస్ ఆదిలాబాద్ నియోజకవర్గం ప్రధాన కార్యదర్శి సామ రూపేష్‌రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలో యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో రూ.12 వేల విలువ గల క్రికెట్, షటిల్, వాలీబాల్ క్రీడా పరికరాల కిట్లను యూత్ సభ్యులకు అందజేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో యువ క్రీడాకారులకు గుర్తింపు ఉంటుందని, ఆ దిశగా సహకారం అందిస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ నాక్లే రాందాస్, నాయకులు గావుండే ఘణేశ్యాం, వాంఖడే రూప్‌రావు, దేవ్‌తాళే విఠల్, కన్యరాజు, గోడే అవినాష్, బొక్రే శంకర్, ఠాక్రే విపిన్, గులాబ్, బోయర్ ప్రమోద్, తదితరులు పాల్గొన్నారు.


క్రీడా పరికరాలు అందజేస్తున్న సామ రూపేశ్‌రెడ్డి

కుష్ఠు నిర్మూలనపై అవగాహన

నార్నూర్: మండల కేంద్రంలోని బాలికల ఆశ్రమ పాఠశాలలో కుష్ఠు నిర్మూలనపై విద్యార్థినిలతో గురువారం ప్రతిజ్ఞ చేయించారు. ఈసందర్భంగా హెల్త్ సూపర్‌వైజర్ చౌహాన్ చరణ్‌దాస్ మాట్లాడుతూ.. కుష్ఠువ్యాధి ‘మైకో బ్యాక్టీరియా లెప్రే’ అనే బ్యాక్టీరియా వలన వస్తుందన్నారు. ఇది చర్మానికి, నరాలకు సోకుతుందని, వ్యాధి లక్షణాలు బయట పడేందుకు కనీసం 3 నుంచి 5 సంవత్సరాల కాలం పడుతుందన్నారు. కుష్ఠును చికిత్స ద్వారా నయం చేయవచ్చన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జాదవ్ విఠల్, వార్డెన్ వనిత పవార్, వైద్య సిబ్బంది ఈశ్వర్, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న వైద్య సిబ్బంది

పరీక్ష సామగ్రి పంపిణీ

తాంసి: మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు కప్పర్ల పాఠశాల ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న విలాస్ గౌడ్ పరీక్ష సామగ్రి అందజేశారు. గురువారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో జెడ్పీటీసీ తాటిపెల్లి రాజు చేతుల మీదుగా విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవో శ్రీకాంత్, హెచ్ఎం శివాజీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సన్మానం

నార్నూర్: ఐదేళ్ల సర్పంచ్‌గా ఉత్తమ సేవలు అందించిన బేతాల్‌గూడ మాజీ సర్పంచ్ సుజాత పరమేశ్వర్‌ను గురువారం గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. గ్రామ పెద్దలు జాదవ్ ప్రకాష్‌నాయక్, బొజ్జు పటేల్‌లు మాట్లాడుతూ.. పాలన సౌలభ్యం కోసం అప్పటి ప్రభుత్వం నూతన గ్రామ పంచాయతీలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రజా సమస్యలు పరిష్కరించి, అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు రాథోడ్ రవీందర్, నగేశ్, బాదిరావు, అంబారావు పాల్గొన్నారు.

ఇచ్చోడ: మండలంలోని ముఖరా(బి) సర్పంచ్ అడవ్ మారుతిని గురువారం పంచాయతీ అనుబంధ గ్రామలైన మాన్కుగూడ, రఘుగూడ గ్రామస్తులు సత్కరించారు. ఐదు సంవత్సరాల పదవి కాలంలో అనుబంధ గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ పాన్‌పట్టె శివాజీ, తదితరులు పాల్గొన్నారు.

బోథ్: సొనాల, పిప్పల్‌ధరి గ్రామ పంచాయతీ మాజీ పాలకవర్గ సభ్యులను గ్రామస్తులు గురువారం ఘనంగా సత్కరించారు. సొనాల మాజీ సర్పంచ్ సదానందం, పిప్పల్‌ధరి మాజీ సర్పంచ్ శ్రీధర్ రెడ్డితో పాటు వార్డు సభ్యులను సత్కరించారు. ఐదేళ్ల పాటు గ్రామంలో అభివృద్ధి పనులు చేపట్టి గ్రామాన్ని అభివృద్ధి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పరామర్శ

ఆదిలాబాద్‌టౌన్: ఇటీవల కన్నుమూసిన మాజీ మంత్రి నర్సారెడ్డి దశదిన కర్మకు బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత హాజరయ్యారు. హైదరాబాద్‌లో నిర్వహించిన నర్సారెడ్డి దశదినకర్మ కార్యక్రమానికి హాజరై ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు

బోథ్: మండలంలోని ధన్నూర్(బి) గ్రామానికి చెందిన జక్క రాంరెడ్డి ఇటీవల మృతి చెందడంతో మాజీ ఎంపీ నగేశ్ గురువారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట మాజీ సర్పంచ్ సురేందర్ రెడ్డి, రాజేశ్వర్ రెడ్డి, రాజేశ్వర్, గొడం జుగాదిరావ్, మహిపాల్, విజయ్, అఖిల్, కిషన్, నారాయణ, శ్యాంసుందర్ రెడ్డి, రామేశ్వర్ రెడ్డి, తదితరులు ఉన్నారు.

బోథ్: మండలంలోని ఘన్‌పూర్ గ్రామానికి చెందిన రిటైర్డ్ వీఆర్‌వో భగవాన్‌దాస్ భార్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గ నాయకులు ఆడె గజేందర్ గురువారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన వెంట నాయకులు బలిరాం, జనార్ధన్, సుభాష్, గ్రామస్తులు ఉన్నారు.

‘దేశ అభివృద్ధి మోదీతోనే సాధ్యం’

ఇంద్రవెల్లి: దేశ అభివృద్ధి ప్రధానమంత్రి నరేంద్రమోదీతోనే సాధ్యమని బీజేపీ స్వచ్ఛ భారత్ జిల్లా కన్వీనర్ దీపక్‌సింగ్ షెకవత్ అన్నారు. గావ్ చలో అభియాన్ కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలోని దస్నాపూర్ గ్రామాన్ని సందర్శించి గ్రామస్తులతో సమావేశమయ్యారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని అత్యధిక మెజార్టీతో గెలిపించి, మోదీని మరోసారి ప్రధాన మంత్రి చేసేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ కార్యకర్తలు గేడం యేశ్వంత్‌రావ్, సికరే సందీప్, పోటలే నాందేవ్ పటేల్, వెట్టి సీతారం, రాందాస్, నగేశ్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న నాయకులు


వృథాగా.. భగీరథ నీరు
ఆదిలాబాద్ పట్టణం అంబేద్కర్‌నగర్ ప్రాంతంలోని ఖోజా ఖబరస్థాన్ వద్ద భగీరథ నీరు వృథాగా పోతోంది. పైపుల లీకేజీ కారణంగా వారం రోజులుగా నీరు రోడ్డుపైకి చేరుతోంది. అయినా ఎవరూ పట్టించుకోవడం లేదు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కాలనీ ప్రజలు కోరుతున్నారు. – ఆదిలాబాద్ టౌన్

వేతనాలు చెల్లించాలని నిరసన

ఉట్నూర్‌రూరల్: ప్రభుత్వ ఆసుపత్రిలో ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ పద్ధతిలో వివిధ విభాగాల్లో సేవలందిస్తున్న ఉద్యోగులకు గత మూడు నెలల నుంచి వేతనాలు అందక ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు. దీంతో గురువారం ఉట్నూర్ ప్రభుత్వ ఆసుపత్రి ఎదుట నిరసన తెలిపారు.. మెడికల్, హెల్త్ ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ యూనియన్ రాష్ట్ర కోశాధికారి బొంకంటి సుభాశ్ మాట్లాడుతూ.. వేతనాలు లేక ముప్పులు తిప్పలు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. రాత్రిపగలు కష్టపడి విధులు నిర్వహిస్తున్నప్పటికీ సమయానికి వేతనాలు అందడం లేదన్నారు. పారిశుధ్య, కార్మికులు, సెక్యూరిటీ సిబ్బందికి సైతం వేతనాలు లేక తంటాలు పడుతున్నారు. అనంతరం ఆర్ఎంవో మహేందర్‌కు వినతిపత్రం అందజేశారు. నిరసనలో యూనియన్ నాయకులు జోష్యా, చాగున, మహేశ్, వీణ, సూర్య, భాను, ప్రసాద్, అరుణ్, పరుశురాం, వెంకటేశ్, గంగాధర్ పాల్గొన్నారు.


నిరసన తెలుపుతున్న ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులు

ఆదివాసీ సమస్యలపై అసెంబ్లీలో గళమెత్తాలి


మాట్లాడుతున్న వెట్టి మనోజ్


మట్లాడుతున్న జల్కే పాండురంగ్

ఎదులాపురం: ఆదివాసీల సమస్యలను అసెంబ్లీ సమావేశాల్లో గళమెత్తాలని తుడుందెబ్బ జిల్లా ప్రధాన కార్యదర్శి వెట్టి మనోజ్ డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడారు. ఆదివాసీలకు మెరుగైన వైద్యం అందించే దిశగా నెలకొల్పిన సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో వైద్యుల కొరత ఉందని, వెంటనే వైద్యుల పోస్టులను భర్తీ చేయాలని కోరారు. నీటి ఎద్దడి లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఐటీడీఏలకు పూర్తి స్థాయిలో బడ్జెట్ కేటాయించాలన్నారు. సమావేశంలో నాయకులు ఆత్రం గణపతి, గంగారాం, కేశవ్, ముకుంద్, భారత్, దిగంబర్, గేడం రాములు, తొడసం అశోక్ పాల్గొన్నారు.

బజార్‌హత్నూర్: ఆదివాసీ సమస్యలపై అసెంబ్లీలో ఆదివాసీ ఎమ్మెల్యేలు మాట్లాడాలని తుడుందెబ్బ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జల్కే పాండురంగ్ కోరారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎస్టీ జాబితాలో మరో 11 కులాలను చేర్చేందుకు ప్రభుత్వ ప్రయత్నాలను విరమించుకోవాలని, జీవో నంబర్ 3ని అమలు చేయాలన్నారు. పెసా చట్టం పకడ్బందీగా అమలు చేయాలన్నారు. తుడుందెబ్బ నాయకులు నైతం రమేశ్, ఉయికే సుదర్శన్, వడ్డి ఉత్తం, ముకుందరావ్, గంగాధర్, దేవరావ్ పాల్గొన్నారు.

ఆగని ‘ఆధార్’ కష్టాలు


టోకెన్ల కోసం బారులు తీరిన జనం

- టోకెన్ల కోసం భారీగా తరలివచ్చిన జనం
- ఉదయం నుంచే పడిగాపులు

కైలాస్‌నగర్: జిల్లాలోని ప్రజలకు ఆధార్ కష్టాలు తప్పడం లేదు. రేషన్ ఈకేవైసీ, ఉజ్వల గ్యాస్ కనెక్షన్ల ఈ–కేవైసీకి ఆధార్‌కార్డులను ప్రభుత్వం తప్పనిసరి చేసింది. దీంతో పాటు పదేళ్ల గడువు ముగిసిన ఆధార్ కార్డులన్నింటిని తప్పనిసరిగా అప్‌డేట్ చేసుకోవాలని కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. దీంతో ప్రజలు ఆధార్ కేంద్రాలకు పరుగులు పెడుతున్నారు. ఆధార్ కేంద్రాల నిర్వాహకులు రోజుకు 30 చొప్పున టోకెన్లను జారీ చేస్తున్నారు. గురువారం దస్నాపూర్‌లోని కామన్ సర్వీస్ సెంటర్‌లో ఆధార్ అప్‌డేట్‌కు అవసరమైన టోకెన్లు జారీ చేస్తారని తెలియడంతో ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. వేకువజాము నుంచే పడిగాపులు పడ్డారు. అయితే పీఎం జన్‌మాన్ పథకానికి సంబంధించి ఆదివాసీ గూడెల్లో ప్రత్యేక క్యాంపులను నిర్వహిస్తున్నందున ప్రజలు సహకరించాలని సీఎస్‌సీ జిల్లా మేనేజర్ కామెరి రాహుల్ కోరారు. ప్రతిఒక్కరి ఆధార్ వివరాలను నమోదు చేస్తానని ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.

ప్లేట్లు అందజేత

ఇచ్చోడ: మండలంలోని అడేగామ(బి) ప్రాథమిక పాఠశాలలో గురువారం విద్యార్థులకు గ్రామ పెద్ద కదం ఉత్తంరావు ఆధ్వర్యంలో స్టీల్ ప్లేట్లను విద్యార్థులకు అందజేశారు. విద్యార్థులు మధ్యాహ్న భోజనం చేసేందుకు ఇబ్బంది పడుతుండడంతో ఈ సాయం చేసినట్లు తెలిపారు. అనంతరం సర్పంచ్ కదం వనిత సుభాష్‌రావు, పాఠశాల చైర్మన్ తడికల ప్రకాశ్‌లను పాఠశాల సి బ్బంది ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు భూమన్న, ఉపాధ్యాయులు స్వరూపారాణి, సంజీవ్ రాథోడ్, కదం సుభాష్‌రావు, తదితరులు పాల్గొన్నారు.